


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 07 మే 2027 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 339 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## వైద్య, ఆరోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ – త్వరలో ఏఎన్ఎం, నర్సింగ్ ఫలితాలు విడుదల: మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టినట్లు తెలిపారు. అతి త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాల ఫలితాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. బాలసదనాలు, అంగన్వాడీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సిఎస్ఆర్ నిధులతో పాటు ప్రభుత్వ నిధులతో మౌలిక వసతులు మెరుగుపరుస్తామని తెలిపారు. అంగన్వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలసదనాన్ని ప్రారంభించిన అనంతరం వికలాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకు జొన్న, మొక్కజొన్న పంపిణీ – మధ్యవర్తుల దందాకు చెక్, రైతులకు భరోసా

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 07, ప్రతినిధి: రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను కాపాడుతూ పేదలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేయకుండా సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపులలో నేరుగా తక్కువ ధరకు ప్రజలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ నిర్ణయంతో మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట వేసి రైతు పక్షపాతిగా ప్రభుత్వ భరోసా మరింత బలపడనుంది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సాధారణంగా ప్రభుత్వ ధాన్యాన్ని మార్కెట్‌లో వేలం వేయడం వల్ల మధ్యవర్తులు లాభపడే పరిస్థితి ఉండగా, ఇప్పుడు నేరుగా ప్రజలకు అందించడంతో పారదర్శకత పెరగనుంది. "ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా కాకుండా పేదవాడి ఆకలి తీర్చే పౌష్టికాహారంగా మారాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నట్లు సమాచారం. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు కూడా బలవర్ధక ఆహారం అందనుంది. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగానికి కూడా తక్కువ ధరకు సరఫరా చేసే అవకాశం పరిశీలనలో ఉంది. ప్రభుత్వం తీసుకున్న ఈ వినూత్న నిర్ణయంపై రైతులు, సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి – ఉద్యోగుల సంక్షేమమే మా ప్రాధాన్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 07, ప్రతినిధి: సంక్షేమ శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియను ఎలాంటి వివాదాలకు తావులేకుండా పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సౌలభ్యం, సమానత్వం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ బదిలీల ప్రక్రియను ఆదర్శంగా నిలిచేలా చేపట్టాలని సూచించారు. దీర్ఘకాలంగా దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారు కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు, దంపతులు ఒకే చోట పనిచేసే "స్పౌస్ కేసులు" వంటి అంశాలను మానవీయ దృక్పథంతో పరిగణించాలని ఆదేశించారు. బదిలీలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి డిజిటల్ విధానంలో అమలు చేయాలని, మానవ జోక్యం తగ్గించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వేగంగా స్పందించాలని ఆయన ఆదేశించారు. మహిళా ఉద్యోగులు, దివ్యాంగులు, సీనియర్ ఉద్యోగులకు ప్రత్యేక సౌలభ్యాలు కల్పించాలని, గురుకులాల్లో బోధన నాణ్యత దెబ్బతినకుండా సిబ్బంది సమతుల్యతను కాపాడాలని తెలిపారు. GO 190 అమలులో ఉన్న సమస్యలను సమగ్రంగా పరిశీలించి ఉద్యోగులకు అన్యాయం జరగకుండా సమతుల్య నిర్ణయం తీసుకోవాలని మంత్రి సూచించారు. ఉద్యోగులు సంతృప్తిగా పనిచేసే వాతావరణం కల్పిస్తే బోధన నాణ్యత మరింత మెరుగవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## కోదాడలో దారుణం – నడిరోడ్డుపై భార్యను కత్తితో హత్య చేసిన భర్త



సందేశం టైమ్స్, కోదాడ, మే 07, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో బుధవారం పట్టపగలే దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక బస్టాండ్ సమీపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శిరీష, మణిదీప్ దంపతులు మధ్య మాటల తగాదా చోటుచేసుకోవడంతో ఆవేశానికి లోనైన భర్త మణిదీప్ తన వద్ద ఉన్న కత్తితో భార్య శిరీషపై విచక్షణారహితంగా దాడి చేయగా ఆమెకు మెడ, పొట్ట భాగాల్లో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రద్దీ ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా అక్కడున్న కొందరు పట్టుకున్నట్లు సమాచారం. కుటుంబ కలహాలే హత్యకు కారణమని ప్రాథమికంగా పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రాష్ట్ర భద్రతా సలహాదారుగా రిటైర్డ్ డీజీపీ బి. శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం – గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 07, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా (SSA) రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆయనను మూడు సంవత్సరాల కాలానికి ఈ పదవికి నియమించిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నియంత్రణ, రహదారి భద్రత వంటి కీలక అంశాలపై ప్రభుత్వానికి ఆయన సలహాలు అందించనున్నారు. ఐపీఎస్ అధికారిగా దీర్ఘకాల అనుభవం కలిగిన శివధర్ రెడ్డి, అంతర్గత భద్రత, మావోయిస్టు నిరోధక చర్యలు, ఇంటెలిజెన్స్ విభాగం వంటి కీలక బాధ్యతల్లో పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సీపీ సుమతి, ఐజీ గజరావు భూపాల్ సహా పలువురు ఉన్నతాధికారులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.


## రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు – 39 వేల ఉద్యోగాలు సీఎం చంద్రబాబు నాయుడు




సందేశం టైమ్స్, అమరావతి, మే 07, ప్రతినిధి: రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రాబోతున్నాయని, వాటి ద్వారా సుమారు 39,000 ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పెట్టుబడులు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా నిర్ణీత గడువులోగా వాస్తవ రూపం దాల్చి ప్రారంభోత్సవాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (SIPB) సమావేశంలో మాట్లాడుతూ సుమారు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని వెల్లడించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుండగా, సత్యసాయి జిల్లాలో రూ.51,000 కోట్లతో సోలార్ పవర్ ప్రాజెక్టు, కడప జిల్లాలో అదానీ గ్రూప్ రూ.12,000 కోట్లతో హైడ్రో ఎనర్జీ ప్రాజెక్టు, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పెట్టుబడులన్నీ వేగంగా అమలులోకి వచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం సూచించారు.

## దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో పోలీస్ కమిషనర్ అండర్‌కవర్ తనిఖీ – పోకిరీలపై చర్యలు






సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 07, ప్రతినిధి: మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐపీఎస్ అధికారి సుమతి గ్రౌండ్ లెవెల్ పరిస్థితులను పరిశీలించే క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో సాధారణ వేషధారణలో తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సందర్భంగా బస్టాండ్ పరిసరాల్లో కొంతమంది వ్యక్తులు మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వేధింపులకు పాల్పడినట్లు గుర్తించిన అధికారులు, వెంటనే స్పందించి వారిని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి సమయంలో సరైన పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడం వల్ల కొన్ని అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన కమిషనర్, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. మొత్తం సుమారు 40 మందిని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మద్యం, మత్తు పదార్థాల వినియోగం మరియు ప్రజా ప్రదేశాల్లో అసభ్య ప్రవర్తనపై గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, రైతు సంక్షేమం, స్వీయ గణన, ధాన్యం సేకరణపై కలెక్టర్, చైర్ పర్సన్ సమీక్షలు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 07, ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో స్వీయ గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా చైర్ పర్సన్ మోరిశెట్టి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 10 వరకు గడువు ఉన్నందున ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ లేదా యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన మారథాన్ ర్యాలీ అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఇదే సమయంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొంటూ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు భరోసా, రైతు భీమా, మద్దతు ధరలతో పాటు సన్న బియ్యానికి రూ.500 బోనస్ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన, ఆధునిక సాగు విధానాలు, నానో యూరియా వినియోగం, ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అదే విధంగా ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాయినిగూడెం గ్రామ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్, రవాణా, తూకం, మిల్లులకు అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం లేకుండా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొత్తంగా జిల్లాలో రైతు సంక్షేమం, ధాన్యం సేకరణ, ప్రజా అవగాహన కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.



## ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 07, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యానికి తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మండలం రాయినిగూడెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ, తూకాలు మరియు రవాణా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేస్తూ లారీలు గంటల తరబడి వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమించే మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి నాణ్యతా ప్రమాణాల ప్రకారం కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశిస్తూ గడువులోగా సేకరణ పూర్తి చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ లాలు, ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పర్యటనను అడ్డుకుంటాం: ఆప్ రాష్ట్ర సలహాదారు దిడ్డి సుధాకర్



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 07, ప్రతినిధి: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు అర్హత లేదని, ఆయన రాకను చీపుర్లు చూపించి అడ్డుకుంటామని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర సలహాదారు డాక్టర్ దిడ్డి సుధాకర్ తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడం, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, ఎన్నికల ప్రక్రియను దుర్వినియోగం చేయడం వంటి చర్యలు దేశ ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారాయని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను వేధించడం, నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజలు ఎందుకు ఆదరించాలని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ఇలాంటి రాజకీయాలను సహించబోరని పేర్కొంటూ మోదీ పర్యటన సందర్భంగా హైదరాబాద్ బేగంపేట్ విమానాశ్రయం వద్ద చీపుర్లు చేతబూని నిరసన ప్రదర్శనలు చేపడతామని తెలిపారు.

## టేక్మాల్‌లో శివశంకర్–రాధిక వివాహ వేడుక ఘనంగా నిర్వహణ




సందేశం టైమ్స్, టేక్మాల్, మే 07, ప్రతినిధి: టేక్మాల్ మండలం బోడ్మట్‌పల్లి ఫంక్షన్ హాల్‌లో టేక్మాల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివశంకర్, రాధిక దంపతుల వివాహ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అశీల సాగర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ కమ్మరి సుగుణాకర్, టేక్మాల్ పట్టణ అధ్యక్షుడు భక్తుల కిషోర్, నాయకులు విశ్వం, షాహిద్, జాంబో, రాజేష్ తదితరులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది.

## ఆందోల్‌లో శ్రీ రంగనాథ స్వామివారి కల్యాణోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు



సందేశం టైమ్స్, ఆందోల్, మే 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లోని పురాతన శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన మంత్రి ముందుగా దేవాలయంలో దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించిన మంత్రి భక్తులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

## సంగారెడ్డిలో సైబర్ జాగ్రుకత దివాస్: విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో సైబర్ జాగ్రుకత దివాస్ సందర్భంగా నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ సైబర్ మోసాల నుండి రక్షణకు అవగాహన ఒక్కటే మార్గమని తెలిపారు. ఐపీఎల్ టికెట్ల పేరిట తప్పుడు ఐడీలతో మోసాలు, మల్టీ లెవెల్ మార్కెటింగ్, నకిలీ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, లోన్ యాప్స్ వంటి ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "డిజిటల్ అరెస్ట్" అనేది పూర్తిగా సైబర్ నేరగాళ్లు పన్నిన వల మాత్రమేనని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అలాగే పోలీసులమని చెప్పి వీడియో కాల్స్ చేసే వారిని నమ్మకూడదని హెచ్చరించారు. తెలియని లింకులు, APK ఫైళ్లు ఓపెన్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ రాము నాయుడు, సైబర్ సెల్ టెక్నికల్ అసిస్టెంట్ రాజలింగ గౌడ్, కళాశాల ప్రిన్సిపల్ సుశీల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాథ స్వామివారి కల్యాణోత్సవంలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ



సందేశం టైమ్స్, ఆందోల్, మే 07, ప్రతినిధి: ఆందోల్ పట్టణంలోని పురాతన శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో నిర్వహించిన వార్షిక కల్యాణోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అధికారులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికి వేదమంత్రాల నడుమ ఆలయ ప్రాంగణంలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

## సంగారెడ్డిలో 'వివా అండ్ క్లినికల్ గైడ్' పుస్తకావిష్కరణ – వైద్యరంగంలో ఆవిష్కరణలు అవసరం: మంత్రి దామోదర్ రాజనర్సింహ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: సంగారెడ్డిలోని తన నివాసంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రముఖ ఓరల్ & మ్యాక్సిలోఫాసియల్ నిపుణుడు డా. చిత్తలూరి లక్ష్మణ్ రాయ్ రచించిన 'వివా అండ్ క్లినికల్ గైడ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు అత్యవసరమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో నాణ్యమైన మెడికల్ విద్య కోసం పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణలో చదువుకున్న వైద్య విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని అన్నారు. డా. లక్ష్మణ్ రాయ్ రచించిన ఈ పుస్తకం వర్ధమాన డెంటల్ వైద్యులకు క్లినికల్ మార్గదర్శిగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జాతీయ డెంటల్ అసోసియేషన్ సభ్యులు డా. ప్రమోద్ కుమార్, డా. సుధీర్ రామ్ శెట్టి పాల్గొన్నారు.

## కంగ్టి మండలంలో విషాద ఘటన: బాధిత కుటుంబాలను పరామర్శించిన మహారెడ్డి భూపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, కంగ్టి, మే 07, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం బొర్గి తండాలో జరిగిన విషాద ఘటనలో సావిత్రిబాయి, నికిత, నందిని అనే ముగ్గురు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడంతో ప్రాంతంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి బాధితుల నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన ఇలాంటి ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజ్ పటేల్, బసవరాజ్ పటేల్, హుల్బరావు, అబ్రం, ప్రకాష్ రెడ్డి, సురేష్ రావు, మనోజ్, భూమప్ప తదితరులు పాల్గొన్నారు.

## చిట్కుల్‌లో నీలం రాధ– నిర్మల్ 5వ వర్ధంతి: సేవా కార్యక్రమాలతో నివాళులు




సందేశం టైమ్స్, చిట్కుల్, మే 07, ప్రతినిధి: మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తన తల్లిదండ్రులు స్వర్గీయ నీలం రాధ, నిర్మల్ గార్ల 5వ వర్ధంతిని చిట్కుల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి భావోద్వేగంతో నివాళులర్పించిన ఆయన తల్లిదండ్రులు చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజలకు సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నానన్నారు. కరోనా సమయంలో ఒక్కరోజు వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోవడం తనకు పెద్ద దెబ్బ అయినప్పటికీ వారు నేర్పిన క్రమశిక్షణ, సేవా భావమే తనను ప్రజా క్షేత్రంలో నిలబెట్టిందని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా సామాన్య ప్రజల కష్టాల్లో తోడుండటమే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

## రూ.7 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన బోధన్ టూ టౌన్ ఎస్ఐ



సందేశం టైమ్స్, నిజామాబాద్, మే 07, ప్రతినిధి: నిజామాబాద్ జిల్లా బోధన్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ చిటన్నోజు భాస్కరాచారి రూ.7 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. తన సోదరుడి కుమారుడి పేరును క్రిమినల్ కేసులో చేర్చకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుండి లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.




## సంగారెడ్డి తారా డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాతిపదికన సంగారెడ్డి జిల్లాలోని తారా డిగ్రీ కాలేజీలో మే 08న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని ఎంపిడిఓలు, పంచాయత్ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని మే 08న సంగారెడ్డి జిల్లాలోని తారా డిగ్రీ కాలేజీలో జరిగే మెగా జాబ్ మేళాలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య, జిల్లా పంచాయత్ అధికారి, యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్, ఉపాధి కల్పన అధికారి రామరాజు, పరిశ్రమల శాఖ అధికారి ప్రకాశరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## రైతులు రుణాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలి: వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. గోపి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో మూడవ రోజు సందర్భంగా నర్సాపూర్ మార్కెట్ యార్డులో బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పీఓల ద్వారా రైతులకు అందించే సేవలు మరియు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. గోపి, అదనపు కలెక్టర్ మెంచు నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గోపి మాట్లాడుతూ రైతులు బ్యాంకులు, సహకార సంఘాలు అందించే రుణాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ గత దశాబ్దంతో పోల్చితే తెలంగాణలో వరి సాగు, యూరియా వినియోగం రెట్టింపు అయినందున తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని సిఫారసు చేసిన ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకుని వ్యవసాయ శాఖ కార్యక్రమాలను వినియోగించుకోవాలని, పంట మార్పిడి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ భవిష్యత్తు తరాల కోసం నేలను సంరక్షించేందుకు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ మెంచు నగేష్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మి, పిఏసిఎస్ ఛైర్మన్ రాజు యాదవ్, ధర్మారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, వివిధ బ్యాంక్ మేనేజర్లు, గ్రామ సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, రైతు రక్షణ సమితి అధ్యక్షుడు మిరియాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: జిల్లాలో నూతన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మెదక్ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు ప్రభుత్వ శాఖల కేటాయింపు కార్యక్రమం నిర్వహించగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు క్రమం తప్పకుండా జీతాలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలను నిర్బంధంగా కల్పించాలన్నారు. ఈ సౌకర్యాలు అందించని ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి ఇతర ఏజెన్సీలకు అవకాశాలు ఇస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రామరాజు, జిల్లా విద్యాధికారి శ్రీరామ్, శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, లేబర్ ఆఫీసర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులను కాలరాస్తే ఉపేక్షించం: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా శాఖల అధికారులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, డ్రగ్స్ నియంత్రణ, కిశోర బాలికల ఆరోగ్య అవగాహన, విద్యా ప్రోత్సాహం, పాఠశాలల్లో డ్రాప్ అవుట్ తగ్గింపు, మరుగుదొడ్ల నిర్మాణం, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు, సాధారణ ప్రసవాలు, పోక్సో కేసుల నమోదు, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ బాలలు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా ఎదగడానికి అవసరమైన హక్కులను కాపాడటం ప్రభుత్వం మాత్రమే కాక సమాజం మొత్తం బాధ్యత అని స్పష్టం చేస్తూ బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా ఎలాంటి ఒత్తిడులు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నారులు సమాజ భవిష్యత్తుకు బలమైన స్థంభాలని, వారి శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో బాలల రక్షణ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని, పాఠశాలలు, హాస్టళ్లు, బాలల సంరక్షణ గృహాలు, అనాథాశ్రమాల్లో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించి చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతీ ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వందనా గౌడ్, చందన, సరిత, అపర్ణ అగర్వాల్, వచన్ కుమార్, సిద్దిపేట డిఆర్ఓ నాగరాజమ్మ, మెదక్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సిద్దిపేట అడిషనల్ ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాల ప్రాథమిక ఓటర్ల జాబితా విడుదల



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంఘాల ప్రాథమిక ఓటర్ల జాబితాను విడుదల చేసి సంబంధిత సంఘ పరిధిలో మరియు చేనేత, జౌళి శాఖ కార్యాలయాల నోటీసు బోర్డుల ద్వారా ప్రదర్శించామని చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు తెలిపారు. ఈ జాబితాపై సభ్యులకు ఎలాంటి ఆక్షేపణలు లేదా సవరణలు ఉన్నా సంబంధిత ఆధార పత్రాలతో కలిసి సిద్ధిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మే 08లోపు సమర్పించవలసిందిగా కోరారు. సభ్యత్వ ధృవీకరణ పత్రం, గుర్తింపు కార్డు మరియు ఇతర అవసరమైన ఆధారాలను జత చేయాలని సూచిస్తూ గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అందువల్ల సంబంధిత సభ్యులు సమయానికి తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి తుది ఓటర్ల జాబితాను నిర్ణీత తేదీన ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## నవజాత శిశువు విక్రయంపై కేర్ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం డిమాండ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: మెదక్ పట్టణంలోని కేర్ ఆసుపత్రిలో పుట్టిన శిశువు మృతి చెందిందని తల్లిదండ్రులను మోసం చేసి శిశువును విక్రయం చేసిన ఘటనపై ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి హాస్పిటల్‌ను సీజ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ఎఏఓ యూనిస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. నర్సమ్మ, ఏ. మల్లేశం మాట్లాడుతూ గత నెల 12న పాపన్నపేట మండలం లక్ష్మినగర్‌కు చెందిన నస్రా ఫాతిమా డెలివరీ కోసం కేర్ ఆసుపత్రిలో చేరగా పుట్టిన శిశువు మరణించిందని తల్లిదండ్రులకు తెలియజేసి మోసం చేసి విక్రయించినట్లు ఆరోపించారు. శిశువుల విక్రయం బీఎన్ఎస్ సెక్షన్ 370, 372, 373 మరియు జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015లోని సెక్షన్ 80, 81 ప్రకారం తీవ్రమైన నేరమని తెలిసినప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం ఈ చర్యలకు పాల్పడిందని పేర్కొన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిపై, ప్రోత్సహించిన ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో శిశువుల అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న ముఠాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని, మెదక్‌తో పాటు నర్సాపూర్, తుప్రాన్, చేగుంట, రామాయంపేట, పెద్దశంకరం పేట ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జె. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో కత్రం కబడ్డీ లీగ్ ఘనంగా ముగింపు – మునగాల హంటర్స్ విజేత



సందేశం టైమ్స్, కోదాడ, మే 07, ప్రతినిధి: సమాజంలో మత్తు పదార్థాలు, బెట్టింగ్ వంటి దురలవాట్లు పెరుగుతున్న పరిస్థితుల్లో క్రీడల ద్వారానే యువతలో క్రమశిక్షణ పెంపొందుతుందని సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్ రెడ్డి అన్నారు. కత్రం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన కత్రం కబడ్డీ లీగ్ సీజన్-1 కోదాడ నియోజకవర్గ స్థాయి పోటీలు బాయ్స్ హై స్కూల్ మైదానంలో ఘనంగా ముగిశాయి. ఫ్లడ్ లైట్స్ వెలుగులో ప్రో కబడ్డీ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొనగా ఫైనల్లో అనంతగిరి హాట్స్‌పై మునగాల హంటర్స్ జట్టు విజయం సాధించి రూ.75 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందుకుంది. రన్నర్‌గా నిలిచిన అనంతగిరి జట్టుకు రూ.60 వేల బహుమతి, తృతీయ స్థానంలో నిలిచిన కోదాడ జట్టుకు రూ.40 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన మోతే జట్టుకు రూ.20 వేలు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో అల్లం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ యువతను డ్రగ్స్, బెట్టింగ్ వంటి వ్యసనాల నుండి దూరం చేయడానికి క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని, మన మట్టి క్రీడ అయిన కబడ్డీ అభివృద్ధికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నామా నరసింహారావు, ఛైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మేనేపల్లి శ్రీనివాసరావు, కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్, వైద్యులు, క్రీడా ప్రముఖులు మరియు కత్రం చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని పీఏసీఎస్ చైర్మన్‌గా కొండపల్లి శేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకారం



సందేశం టైమ్స్, చింతకాని, మే 07, ప్రతినిధి: చింతకాని మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని కొనసాగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు కొండపల్లి శేఖర్ రెడ్డి సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన పాలకవర్గాన్నే కొనసాగించాలని వచ్చిన ఆదేశాల నేపథ్యంలో సభ్యులతో కలిసి కార్యాలయంలో తిరిగి పాలనను ప్రారంభించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పాలకవర్గ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించి మండలంలోని రైతులకు సొసైటీ ద్వారా అందాల్సిన అన్ని సదుపాయాలను సకాలంలో అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ పనుల సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పిస్తూ పంట సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో శ్రీనివాసరావు, సిబ్బంది, వివిధ గ్రామాల పాలకవర్గ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖమ్మం సుడా చైర్మన్‌గా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ నియామకం



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 07, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం సుడా చైర్మన్‌గా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పదేళ్లపాటు ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పార్టీ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారని, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వహించారని పేర్కొంటూ ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఖమ్మం నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పట్టణ ప్రణాళికల అమలులో వేగం పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నియామకం చేసినట్లు తెలుస్తోంది.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన – పారదర్శక కొనుగోలు ప్రక్రియకు చర్యలు: అడిషనల్ కలెక్టర్ పాండు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. పుల్కల్ మండలంలోని పుల్కల్, గొంగళూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, రికార్డు నిర్వహణ, తేమ శాతం తదితర అంశాలను ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించుకునేలా ఏర్పాట్లు చేయాలని, మద్దతు ధర ప్రకారం చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రవాణా జాప్యం లేకుండా వాహనాలను పెంచాలని ఆదేశించారు.

# అడిషనల్ కలెక్టర్‌గా టి.ఎల్. సంగీత బాధ్యతల స్వీకారం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా టి.ఎల్. సంగీత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం రెవెన్యూ శాఖ అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అడిషనల్ కలెక్టర్ టి.ఎల్. సంగీత తెలిపారు.

# ప్రైవేట్ జూనియర్ కళాశాలల నమోదు కోసం దరఖాస్తుల ఆహ్వానం – ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రెస్ నోట్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో 2026–2027 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, మైనారిటీ మరియు ఈబీసీ విద్యార్థులకు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకం కింద ఆసక్తి గల గుర్తింపు పొందిన ప్రైవేట్ రెప్యూటెడ్ జూనియర్ కళాశాల యాజమాన్యులు, రీన్యువల్ కళాశాలలు, కార్పొరేట్ కళాశాలలు https://telanganaepass.crr.gov.in� ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత ధృవపత్రాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 11.05.2026గా నిర్ణయించారు. గత ఐదు సంవత్సరాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల కోచింగ్ వివరాలు, ఎంపికైన విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# ఉద్యోగ మేళా నిర్వహణ – సంగారెడ్డిలో 08న కార్యక్రమం: జిల్లా యువజన, క్రీడా కార్యాలయం ప్రకటన

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 07, ప్రతినిధి: జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉద్యోగ మేళా మే 08న సంగారెడ్డి తారా డిగ్రీ కళాశాలలో నిర్వహించబడనుంది.

ఉమ్మడి మెదక్ జిల్లా (సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట) ప్రాంతానికి చెందిన ఆసక్తి గల నిరుద్యోగులు https://satg.telangana.gov.in/prajapalana� వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉదయం 8 గంటలలోపు అవసరమైన ధృవపత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని జిల్లా యువజన మరియు క్రీడా అధికారి టి. అఖిలేశ్ రెడ్డి తెలిపారు.



# పంట అవశేషాలను కాల్చవద్దు భూసార పరిరక్షణకు ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 07, ప్రతినిధి: ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడిన నేపథ్యంలో పంట అవశేషాలను కాల్చవద్దని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రైతులకు హెచ్చరిక జారీ చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో పాటు పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అలాగే ఈ విధమైన దహనం వల్ల వాయు కాలుష్యం పెరిగి ప్రజల్లో శ్వాస సంబంధిత సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. భూమిలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోవడంతో రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి వస్తుందని, దీనివల్ల ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గుతుందని ఆయన వివరించారు. రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను తప్పనిసరిగా అవలంబించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విజ్ఞప్తి చేశారు.

# కడెం కుస్తీ పోటీలో డబుల్ కుస్తీ విజేత ధీరజ్ ఉద్గిర్‌కు వెండి కడియం బహుమతి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 07, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ బొమ్మడ్పల్లి గ్రామంలో కడెం కుస్తీ పోటీలు నిర్వహించగా డబుల్ కుస్తీ విభాగంలో గెలుపొందిన మల్లా యోధుడు ధీరజ్ ఉద్గిర్ మహారాష్ట్రకు గ్రామానికి చెందిన కంకర సంఘయ్య ఆరు తులాల వెండి కడియాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు, వైస్ చైర్మన్ ఈశ్వరప్ప, విఠల్ శంకర్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొని విజేతను అభినందించారు.

# ఉసిరికపల్లిలో కాంగ్రెస్ యువ నాయకుడు పుండరీకం జన్మదిన వేడుకలు ఘనంగా




సందేశం టైమ్స్, వట్పల్లి, మే 07, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో కాంగ్రెస్ యువ నాయకుడు పుండరీకం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ప్రొడక్షన్ లీగల్ సర్వీస్ సంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్ రవీందర్ మాట్లాడుతూ పుండరీకం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విఠ్ఠల్, రాజు, వివేక్, గణేష్ గౌడ్, సతీష్, అరవిందు తదితరులు పాల్గొని పుండరీకానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# భూ పరిపాలన వ్యవస్థలపై వీడియో కాన్ఫరెన్స్ – సీసీఎల్ఏ నుంచి అధికారులతో సమీక్ష



సందేశం టైమ్స్, బాపట్ల, మే 07, ప్రతినిధి: అమరావతి రాష్ట్ర సచివాలయం సీసీఎల్ఏ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ ట్రూతింగ్, విలేజ్ సర్వేయర్ లాగిన్, వీఆర్వో, తహసీల్దార్, జాయింట్ కలెక్టర్ లాగిన్లు, వెబ్‌ల్యాండ్ వ్యవస్థ, పట్టాదార్ పాస్‌బుక్స్, ఈ-కేవైసీ వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్ష చేశారు. జిల్లా స్థాయిలో బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి., జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట పాల్గొని సంబంధిత అంశాలపై చర్చించారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు అనుమతులు ఇవ్వాలి కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 07, ప్రతినిధి: హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కోరారు. బుధవారం జరిగిన భేటీలో ఇద్దరూ సుమారు అరగంటపాటు సమావేశమై మెట్రో విస్తరణపై విస్తృతంగా చర్చించారు. మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఆధీనంలోకి తీసుకున్న విషయాన్ని వివరించిన సీఎం, రెండో దశ పనులకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన ఆమోదించాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. నగర రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణ అత్యవసరమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.